# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాలకు... కేంద్ర ఎన్నికల సంఘం... ప్రత్యేక పరిశీలకులను నియమించింది.
- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.
- ఎన్నికల ప్రచారానికి అనుమతులు పొందేందుకు అభ్యర్థులు సువిధ యాప్ ను వినియోగించుకోవాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ సూచించారు.
- రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాలకు ప్రత్యేక పరిశీలకులను నియమించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు... ఏడు కోట్లకు పైగా జనాభా కలిగి ఉన్న పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు ఈ పరిశీలకులను నియమిస్తూ ఈరోజు ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ ప్రక్రియకు విఘాతం కలిగించే అన్ని ప్రయత్నాలను నిరోధించడం లక్ష్యంగా ఈ పరిశీలకులు పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు, ఓటింగ్ యంత్రాల పనితీరును పర్యవేక్షించనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఎన్నికల కార్యాలయం నుండి లేదా సున్నితమైన ప్రాంతాలకు వెళ్ళి కూడా పరిశీలకులు తమ విధులను నిర్వహించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజబాబు, అనంతపురం కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమి, తిరుపతి జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి లక్ష్మీశ లను బదిలీ చేస్తూ వారిని విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది.

అదేవిధంగా ప్రకాశం, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాల ఎస్పీలను వెంటనే బదిలీ చేయాలని, వారిని ఎన్నికలకు సంబంధం లేని పోస్ట్‌ల్లో నియమించాలని స్పష్టం చేసింది. కాగా... ఇటీవల రాష్ట్రంలో జరిగిన ప్రధాన మంత్రి సభలో భద్రత లోపాలకు సంబంధించి గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి విధుల నుండి తప్పుకోవాలని ఆదేశించింది. ఈరోజు సాయంత్రం 5 గంటల లోపుగా బదిలీ చేయాలని, కింది స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది.

==============================

ఎన్నికల ప్రచారానికి సత్వరం అనుమతులు పొందేందుకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు సువిధ యాప్ ను వినియోగించుకోవాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సభలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించేందుకు అభ్యర్థులు ఈ యాప్ ద్వారా సులభంగా ఎన్నికల సంఘం అనుమతులు పొందవచ్చన్నారు. అభ్యర్థులు 48 గంటల ముందు సింగిల్ విండో పద్ధతిలో దరఖాస్తు చేసుకుంటే... 24 గంటల్లో  అనుమతులు లభిస్తాయని వివరించారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాల వద్దనే సువిధ కౌంటర్ లను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలియజేశారు.

==============================

వచ్చే నెల 1వ తేదీ నుండి అల్లూరి సీతారామరాజు జిల్లాలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధి కార సంస్థ అధికారి ఏ. జగన్మోహనరావు తెలిచేసారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... రాష్ట్ర  క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టర్ ల ఉత్తర్వులు మేరకు జిల్లా వ్యాప్తంగా పలు క్రీడాంశాలకు సంబంధించి శిబిరాలు  జరుగుతాయన్నారు. 8 నుండి14 సంవత్సరాల మధ్య వయసు కలిగిన బాలబాలికలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిబిరాలలో శిక్షకులుగా పాల్గొనేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన క్రీడా సంఘాలు, కోచ్ లు, క్రీడాకారులు ఈ నెల 5వ తేదీ లోపుగా పాడేరు లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

==============================

భారత తీర రక్షక దళానికి చెందిన కాలుష్య నియంత్రణ నౌక సముద్ర పహెరేదార్... మూడు రోజుల సందర్శన నిమిత్తం వియత్నాంలోని హోచి మిన్ కు చేరుకుంది.  ఆగ్నేయాసియా దేశాల అసోసియేషన్ పరస్పర సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ నౌకను  వియత్నాంకు పంపినట్టు  కోస్ట్ గార్డ్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్శన సమయంలో నౌకలోని సిబ్బంది... సముద్ర కాలుష్య ప్రతిస్పందన, సముద్ర శోధన ఇంకా రెస్క్యూ, సముద్ర చట్టాల అమలుపై దృష్టి సారించనున్నారని వివరించారు. ఈ కార్యకలాపాలలో క్రాస్ - డెక్ శిక్షణ, విషయ పరిజ్ఞాన మార్పిడి, క్రీడాంశాలు, వియత్నాం కోస్ట్ గార్డ్ (VCG) తో పాసేజ్ విన్యాసాలు కూడా ఉంటాయని అధికారులు తెలియజేశారు.

==============================

ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు జరుగుతాయని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్య వాణి తెలిపారు.  ధాన్యం కొనుగోలుకు సంబంధించి నెల్లూరులో వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం విక్రయించే  ప్రతి రైతు వద్ద బయోమెట్రిక్ నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు తర్వాత  మిల్లుకు తరలించే వాహనానికి తప్పనిసరిగా జి.పి.ఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

విరామం

==============================

రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీలు వరకు క్రమంగా పెరిగే అవకాశం ఉన్నట్టు అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని, రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొని ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు )

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈస్ట్ కోస్ట్ రైల్వే - వాల్తేర్ డివిజన్ పరిధిలోని విశాఖపట్నం - పలాస మెయిన్ లైన్‌లో సెక్షనల్ వేగాన్ని గంటకు 130 కిలోమీటర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని అమలులోకి తీసుకువచ్చినట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... విశాఖపట్నం - పలాస సెక్షన్‌లో సుమారు 200 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న అప్ లైన్, డౌన్ లైన్ మిడిల్ లైన్ లకు వర్తిస్తుందని పేర్కొన్నారు. వేగాన్ని పెంచడం ద్వారా LHB కోచ్ రైళ్లు, వందే భారత్ రైళ్లు, అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ లతో సహా ఈ మార్గంలో నడిచే వివిధ రకాల రైళ్లకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పోలీస్ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజి జి.పాలరాజు సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఈరోజు ఆయన జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అధికారులు సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా భరోసా కల్పించాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల్లో పాల్గొనే విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తున్నామని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈరోజు కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని జిల్లాలోని దివ్యాంగులంతా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో దివ్యాంగులకు కల్పించనున్న సౌకర్యాలపై ఈ సమావేశంలో చర్చించి, దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల అభిప్రాయాలను సేకరించారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సక్షం యాప్, వారికి ఎంతో సహాయకారిగా ఉంటుందని, దీనిని అవసరమైన వారంతా డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించేకునేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసిందని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. పోలీస్ సిబ్బంది, సాయుధ దళాలు ఈరోజు నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో ఆయన ఎస్పీ మేరి ప్రశాంతి, సంయుక్త కలెక్టర్ లావణ్య వేణిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓటుహక్కు కలిగిన వారంతా తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి 10 వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల అనంతరం ఈవీఎంలను ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరచనున్నట్టు ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఏ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. ఈరోజు ఆయన జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ లతో కలిసి రైజ్ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కళాశాలలోని 64 గదులను స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ నిమిత్తం వినియోగించనున్నట్టు తెలిపారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ, కళాశాల వద్ద మూడు అంచల భద్రత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ తీరం నుంచి సముద్రం లో చేపల వేటకు వెళ్లిన ఆరుగురి  మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. వీరంతా నిన్న సాయంత్రం విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి బోటులో  బయలుదేరి దక్షిణ దిశగా గంగవరం వైపు చేపల వేట కోసం బయలుదేరి వెళ్లారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =